# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 349 | పేజీలు: 4 | వెల: 4/- | గురువారం ● 04, జులై 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిని మర్యదపూర్వకంగా కలసి "అసెంబ్లీ సాక్షిగా నా ప్రసంగాలు" పుస్తకాన్ని అందజేస్తున్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి

## కాంగ్రెస్‌లో చేరిన కెకె

- కండువా కప్పి ఆహ్వానించిన ఖర్గే

న్యూఢిల్లీ,జూలై3(నమస్తే ఉదయం): ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన రాజ్యసభ సభ్యుడు కె. కేశవరావు అధికారికంగా కాంగ్రెస్‌లో చేరారు. బిఆర్ఎస్ పార్టీకి ఇదివరకే గుడ్‌బై చెప్పిన రాజ్యసభ ఎంపీ కే కేశవరావు బుధవారం హస్తం పార్టీలో చేరారు. ఢిల్లీలోని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పి కేశవరావుని ఆహ్వానించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ దీపదాస్ మున్షీ, పార్టీ సీనియర్ కేసీ వేణుగోపాల్, మధు యాష్కీ గౌడ్, తదితరులు ఈ కార్యక్రమంలో మిగతా.. 2లో



## తెలంగాణ పిసిపి చీఫ్ ఎంపిక వాయిదా

- ఏకాభిప్రాయం కుదరకపోవడంతో నిర్ణయం
- మంత్రివర్గ విస్తరణ కూడా వాయిదా

న్యూఢిల్లీ,జూలై3(నమస్తే ఉదయం): తెలంగాణ నూతన పీసీసీ అధ్యక్షుడి నియామకంతో పాటు మంత్రివర్గ వర్గ విస్తరణ కూడా తాత్కాలికంగా వాయిదా పడింది. కాంగ్రెస్ నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోడంతో పిసిసి చీఫ్ ఎంపిక ప్రక్రియను ఏఐసీసీ వాయిదా వేసినట్టు తెలుస్తోంది. ఈ విషయమై వారం రోజుల్లో మరోసారి చర్చిం చాలని పార్టీ పెద్దలు నిర్ణయించారు. కాంగ్రెస్ అగ్రనేతల పరస్పర అంగీకారం అనంతరం పీసీసీ అధ్యక్షుడిని నియమించే అవకాశం ఉన్నట్లు సమాచారం. పీసీసీ పదవి కోసం ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, ఎంపీలు బలరాంనాయక్, సురేశ్ షెట్కర్, మిగతా.. 2లో





## నేడు దేశవ్యాప్తంగా స్కూళ్లు, కాలేజీలు బంద్

- నీట్, నెట్ పరీక్షల లీకేజీపై నిరసన
- సమగ్ర విచారణ చేపట్టాలని బంద్‌కు పిలుపు


న్యూఢిల్లీ,జూలై3(నమస్తే ఉదయం): నీట్, నెట్ పరీక్షల లీకేజీపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ జులై 4న దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల బంద్‌కు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఎన్టీఏ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాదు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాపై నిరసన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో 65 పేపర్ లీకేజీ ఘటనలు జరిగాయి. కాగా, నీట్, నెట్ పరీక్షల లీకేజీపై పార్లమెంట్‌లో మోదీ సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, పీడీఎస్‌వో, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. నీట్, నెట్ మాత్రమే కాదు.. గత కొన్నేళ్లుగా అన్ని పరీక్షల పేపర్ లీకేజీల వల్ల విద్యార్థులు, అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విద్యాశాఖపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. పరీక్షలు వారి జీవితాలకు సంబంధించినవని, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని సూచించారు.మరోవైపు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం జూలై 17న తెలంగాణ ప్రభుత్వం సెలవు ప్రకటించగా.. ఆ రోజు తెలంగాణలోనే కాకుండా ఏపీలో కూడా సెలవు. ప్రభుత్వ మరియు ప్రైవేట్ కార్యాలయాలకు కూడా ఈ సెలవు వర్తిస్తుంది. ఆ రోజు తెలుగు రాష్ట్రాల్లో విద్యాసంస్థలకు సెలవు. అలాగే ఈ నెలలో మరో సెలవు కూడా రాబోతోంది. జులై 27న పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రానున్నాయి. ఎందుకంటే ఆ రోజు తెలంగాణ ప్రభుత్వం బోనాలు పండుగను పురస్కరించుకుని సెలవు ప్రకటించింది. తెలంగాణలోని ప్రధాన పండుగల్లో బోనాలు ఒకటి. 7 జూలై 2024న గోల్కొండ కోటలోని జగదాంబిక అమ్మవారికి మిగతా.. 2లో

## అవినీతి పరులు చట్టం నుంచి తప్పించుకోలేరు..

- నల్లధనం,అవినీతిపై మరింత కఠినంగా ఉంటాం
- కేంద్ర దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చాం
- మణిపూర్ అల్లర్ల బాధ్యులపై కఠిన చర్యలు
- రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై చర్చలో ప్రధాని మోడీ
- ప్రధాని ప్రసంగం మధ్యలో విపక్షాల నినాదాలు
- తీవ్రంగా మందలించిన ఛైర్మన్ ధన్‌కడ్
- నిరసనగా రాజ్యసభలో విపక్షాల వాకౌట్



న్యూఢిల్లీ,జూలై3(నమస్తే ఉదయం): దేశాన్ని పట్టి పీడిస్తున్న నల్లధనం, అవినీతి భూతాన్ని నాశనం చేసేందుకు మరింత కఠినంగా వ్యవహరిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యసభలో ప్రకటించారు. అందుకోసం తమ సర్కార్ కేంద్ర దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చిందన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా వీటి నుంచి అవినీతిపరులు తప్పించుకోలేరని హెచ్చరించారు. తమపై మోదీ సర్కార్ ఈడీ, సీబీఐలను ప్రయోగిస్తోందని ప్రతిపక్షాలు కొంతకాలంగా తీవ్ర ఆరోపించడంపై ప్రధాని మోదీ తీవ్రంగా స్పందించారు. దర్యాప్తు సంస్థలు నిజాయితీగా పని చేస్తాయి. ఏ అవినీతిపరుడు చట్టం నుంచి తప్పించుకోలేడు. ఇది మోదీ గ్యారంటీ. అవినీతి, నల్లధనంపై నిలువరించేందుకు కఠినచర్యలు తీసుకునేందుకు మా ప్రభుత్వం దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛనిచ్చిందని ఈ సందర్భంగా దేశ ప్రజలకు తెలియజేస్తున్నా. వాటి చర్యల్లో మా సర్కార్‌కు ఎలాంటి పాత్ర లేదు అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ మద్యం కుంభకోణాన్ని ప్రస్తావించిన మోదీ.. ఆమ్ ఆద్మీ పార్టీతో సహా కాంగ్రెస్‌పై మండిపడ్డారు. 'ఆప్ అవినీతికి పాల్పడింది. మద్యం కుంభకోణానికి తెర తీసింది. పలు కుంభకోణాలతో పాటు మరెన్నో దుశ్చర్యలకు పాల్పడింది. ఆప్ చర్యలపై కాంగ్రెస్ కూడా ఫిర్యాదు చేసింది. కానీ, ఇప్పుడు ఆప్‌పై చర్యలు తీసుకుంటే మోదీపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి అని ప్రతిపక్షాల తీరును దుయ్యబట్టారు.నాడు ఆప్ కుంభకోణాలకు సంబంధించిన సాక్ష్యాలను కాంగ్రెస్ మీడియా ముందు పెట్టిందని గుర్తు చేశారు. 'ప్రస్తుతం ఆ రెండు పార్టీలు ఒక్కటయ్యాయి. ఆప్‌పై గతంలో హస్తం పార్టీ చెప్పినవి సత్యాలా లేక అసత్యాలా?దీనిపై కాంగ్రెస్ వివరణ ఇవ్వాలి అని ప్రధాని డిమాండ్ చేశారు. అవినీతి నిర్మూలనే ఎన్డీఏ లక్ష్యమని.. ఎన్నికల్లో గెలుపోట ములు తమకు ముఖ్యం కాదని మిగతా.. 2లో



## సమగ్ర నివేదిక ఇవ్వండి

- మిషన్ భగీరథ కార్మికుల వేతనాల పై భట్టి ఆదేశం
- సచివాలయంలో అధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష

హైదరాబాద్,జూలై3(నమస్తే ఉదయం): మిషన్ భగీరథ పథకం కింద 42 వేల కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలోని 1150 ఆవాసాలకు 50 శాతం నీళ్ళు సరఫరా చేస్తున్నామని ప్రస్తుతం చెబుతున్నారు.. ఇదే పథకం కింద రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగుతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇవాళ ఆయన మాట్లాడుతూ.. నీటి ఎద్దడి లేదని సర్పంచుల సంతకాలతో గతంలో అసెంబ్లీలో ప్రకటించారు. కేంద్రానికి నివేదిక పంపారని, అంటే ఆనాటి ప్రకటన బోగస్ అని భావించాలా అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ప్రశ్నించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో 23,824 ఆవాసాలు ఉండగా 1156 ఆవాసాల్లో 50 శాతం మాత్రమే నీళ్లు ఇవ్వగలుగుతున్నాం అంటున్నారు, ఆలేరు, భువనగిరి, నల్గొండ నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందడం లేదు నిధులు కావాలని మీ శాఖ నుంచే ఫైల్ రావడం ఏంటని డిప్యూటీ సీఎం మిషన్ భగీరథ అధికారులను ప్రశ్నించారు. మిషన్ భగీరథ పథకం కింద తాగునీటి మిగతా.. 2లో





6న తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ నేపథ్యంలో ప్రజా భవన్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తూ, వివిధ విభాగాల అధికారులకు సూచనలు చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి





- జార్ఖండ్‌లో మారిన సమీకరణాలు
- సీఎం చంపై సోరేన్ రాజీనామా
- పార్టీ నేతలు ఏకగ్రీవ నిర్ణయం



## మళ్లీ సీఎంగా హేమంత్ సోరెన్

రాంచి,జూలై3(నమస్తే ఉదయం): జార్ఖండ్ సీఎం చంపై సోరేన్ రాజీనామా చేశారు. బుధవారం రాజీనామా లేఖను గవర్నర్‌కు సమర్పించారు. జార్ఖండ్ ముక్తి మోర్చా ప్రెసిడెండ్ హేమంత్ సోరేన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకు రావడంతో చంపై సోరేన్ రాజీనామా చేశారు. రాంచీలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు జార్ఖండ్ సీఎం చంపై సోరెన్ రాజీనామా సమర్పించారు. బుధవారంమధ్యాహ్నం రాంచీలోని మాజీ సీఎం హేమంత్ సోరేన్ నివాసంలో ఇండియా బ్లాక్ ఎమ్మెల్యేల అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జార్ఖండ్ సీఎంగా తిరిగి బాధ్యతలు చేపట్టేందుకు హేమంత్ సోరేన్‌ను ఎన్నుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జార్ఖండ్ సీఎం పదవికి చంపై సోరేన్ రాజీనామా చేశారు. హేమంత్ సోరేన్ జార్ఖండ్ సీఎంగా మరోసారి బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ క్రమంలో జార్ఖండ్ రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. హేమంత్ సోరెన్ మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ఈడీ కేసులో మిగతా.. 2లో



## ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ వెనకడుగు

- రెండు లక్షల రుణమాఫీపై తప్పటడుగులు
- బిజెపి ఎంపి రఘునందన్ విమర్శలు

హైదరాబాద్,జూలై3(నమస్తే ఉదయం): అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'కాంగ్రెస్ నేతలు కమిషన్లు వేస్తూ కాలయాపన చేస్తున్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన కాంగ్రెస్ హామీల మిగతా.. 2లో



## ఓటమితో దిష్టి తీసినట్లయ్యింది

- జిమ్మిక్కులతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్న కాంగ్రెస్
- కాంగ్రెస్‌కు ఓటేసి పొరపాటు చేసామన్న బాధలో ప్రజలు
- భారాసను తిరిగి గెలిపించాలన్న కోరుకుంటున్న తెలంగాణ
- త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు వస్తాయి
- పలు జిల్లాల నేతల సమావేశంలో కెసిఆర్

గజ్వేల్,జూలై3(నమస్తే ఉదయం): భారాస విజయ ప్రస్థానంలో లోక్‌సభ ఎన్నికల్లో ఓటమితో దిష్టి తీసినట్లైందని మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ వ్యాఖ్యానించారు. మహబూబాబాద్, మేడ్చల్, నల్గొండ జిల్లా నేతలు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిమ్మిక్కులతో ప్రజలను పక్కదారి పట్టిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పబ్బం గడుపుతోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు ఓటేసి పొరపాటు చేశామనే విషయం ప్రజలకు అర్థమైందన్నారు. భారాసను తిరిగి తెలంగాణ సమాజం కోరుకుంటోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు త్వరలోనే వస్తాయన్నారు. కాంగ్రెస్ పాలనపై మిగతా.. 2లో


# జనరల్ న్యూస్ GENERAL NEWS

గురువారం ● 04, జులై 2024

నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక






డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న పలుగు చెరువు మహేష్ తదితరులు, సర్వే రిపోర్ట్‌లో పార్కు స్థలం ఉన్నట్లు చూపుతున్న మ్యాప్

### కాంగ్రెస్ నాయకుడు పలుగుచెరువు మహేష్

## పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకుని ప్రజల కోసం ఉపయోగపడేలా చూడాలి

రాజేంద్రనగర్, జూలై3(నమస్తే ఉదయం): ఉప్పర్‌పల్లిలోని సోలి టైర్ గ్లోబల్ స్కూల్ ఆవరణలో గల ఒక వెయ్యి 11 గజాల పార్కు స్థలాన్ని కాపాడి ప్రజల కోసం ఉపయోగపడేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పలుగు చెరువు మహేష్ , అనుముల జాన్ పాల్, పి.శ్రీనివాస్ తదితరులు మున్సిపల్ కమిషనర్ కె రవికుమార్‌ను బుధవారం కలిసి ఫిర్యాదు చేశారు. పార్కు స్థలానికి చెందిన సర్వే నివేదికతో పాటు గతంలో జనచైతన్య హౌసింగ్ సొసైటీ వారు మున్సిపల్ అధికారులకు చేసిన గిఫ్ట్ డీడ్ జిరాక్స్‌ను డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌కు అందజేశారు. పార్కు స్థలాన్ని ఆక్రమించిన పాఠశాల నిర్వాహకులు అందులో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసి, గోడకట్టి బయటి వారిని రాకుండా చేశారన్నారు. ఈ స్థలం పై విచారణ జరిపి విలువైన పార్కు స్థలాన్ని కాపాడి స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా బోర్డును ఏర్పాటు చేయాలని తెలిపారు. డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన వారిలో డి.స్వామి దాస్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

# మళ్లీ సీఎంగా హేమంత్ సోరెన్

మొదటిపేజీ తరువాయి..

ఆయన బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న చంపై సోరెన్ సీఎం పదవికి రాజీనామా చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో ఇవాళ జార్ఖండ్ ముక్తి మోర్చా వర్గాలు మాట్లాడుతూ చంపై సోరెన్ స్థానంలో హేమంత్ సోరెన్ మళ్లీ సీఎంగా బాధ్యతలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపాయి. సీఎం చంపై సోరెన్ నివాసంలో జరిగిన సమావేశంలో జేఎంఎం శాసనసభా పక్ష నేతగా హేమంత్ సోరెన్‌ను ఎన్నుకోవాలని కూటమి నేతలు, ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు పేర్కొన్నాయి. జేఎంఎం వర్కింగ్ ప్రెసిడెంట్ హేమంత్ సోరెన్ రాష్ట్రంలోని పార్టీ నేతృత్వంలోని కూటమికి చెందిన ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం మూడోసారి ముఖ్యమంత్రి బాధ్యతల చేపట్టే అవకాశం కనిపిస్తున్నది. అధికార మార్పిడి ఊహాగానాల మధ్య రాంచీలో ఇండియా కూటమి ఎమ్మెల్యేల సమావేశం జరుగనున్నది. ఈ సమావేశాన్ని హేమంత్ సోరెన్ ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఇటీవల భూకుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ ఆయనను అరెస్టు చేసింది. దాదాపు ఐదు నెలల తర్వాత అంటే జూన్ 28న జైలు నుంచి విడుదలయ్యాడు. భేటీ నేపథ్యంలో సీఎం చంపై సోరెన్ ముఖ్య కార్యక్రమాలన్నింటిని రద్దు చేశారు. వాస్తవానికి బుధవారం రాష్ట్రంలో ఎంపిక చేసిన 1500 ఉపాధ్యాయులకు సీఎం చంపై సోరెన్ నియామకపత్రాలు పంపిణీ చేయాల్సి ఉంది. మంగళవారం సైతం సీఎం కార్యక్రమాలన్నీ రద్దయ్యాయి. హేమంత్ సోరెన్ అరెస్ట్ తర్వాత ఫిబ్రవరి 2న జార్ఖండ్ 15వ ముఖ్యమంత్రిగా చంపై సోరెన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఇక నేడు జరుగబోయే సమావేశానికి హాజరుకావాలని పార్టీ సూచించిందని కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యే ఒకరు తెలిపారు. ఈ ఏడాది చివరలో జరుగనున్న ఎన్నికల వ్యూహంపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశానికి జార్ఖండ్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ గులాం అహ్మద్ మీర్, రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ ఠాకూర్ సైతం హాజరవుతున్నారు. రాష్ట్రంలో రాజకీయ అభివృద్ధే ఈ సమావేశం ఎజెండా అని జేఎంఎం అధికార ప్రతినిధి మనోజ్ పాండే తెలిపారు. భేటీలో ముఖ్యమంత్రితో పాటు హేమంత్ సోరెన్ సోదరుడు, మంత్రి బసంత్ సోరెన్ పాల్గొననున్నారు. జేఎంఎం ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామా చేయడంతో గాండే సీటు ఖాళీ అయ్యింది. అక్కడ జరిగిన ఉప ఎన్నికల్లో హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

# ఓటమితో దిష్టి తీసినట్లయ్యింది



మొదటిపేజీ తరువాయి..

ప్రజలు విరక్తితో ఉన్నారని, ఆ విషయం క్షేత్రస్థాయిలో కనిపిస్తోం దన్నారు. పునరుత్తేజంతో మరింతగా ప్రజాదరణ కూడగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తనను కలిసేందుకు ముందస్తు సమాచారంతో మాత్రమే రావాలని సూచించారు. వారానికి రెండు నియోజకవర్గాల పేర్లు చెబుతానని, చెప్పిన వాళ్లు మాత్రమే వస్తే వారితో మనస్ఫూర్తిగా మాట్లాడతానని తెలిపారు. రెండున్నర దశాబ్దాల బీఆర్ఎస్ ప్రస్థానంలో ప్రతి అడుగులో అద్భుతమైన విజయగాథలే తప్ప అపజయగాథలు లేవని.. తెలంగాణ సాధన కోసం బయలుదేరిన నాటి వ్యతిరేక పరిస్థితులనే తట్టుకుని నిలబడ్డ పార్టీకి నేటి పరిస్థితులు ఒక లెక్కే కాదని, ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. ఎలాంటి ఆటంకాలనైనా అలవోకగా దాటుకుంటూ ప్రజాదరణను మరింతగా పొందుకుంటూ ముందడుగు వేస్తుందని స్పష్టం చేశారు. ఎర్రవల్లి నివాసంలో బుధవారం తనను కలిసేందుకు మహబూబాబాద్, మేడ్చల్, నల్గొండ జిల్లాల నుండి వచ్చిన కార్యకర్తలు నాయకులతో కేసీఆర్ సమావేశమయ్యారు. తెలంగాణ అస్థిత్వమే ప్రమాదంలో పడిన దిక్కుమొక్కు లేని చివరిదశ ఉద్యమకాలం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన, అటునుంచి పదేండ్ల ప్రగతి పాలన దాకా తాను ఎదుర్కున్న కష్టాలను కేసీఆర్ ఈ సందర్భంగా కార్యకర్తలకు వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు తెలంగాణను అష్ట దిగ్బంధనం చేసిన సమైక్యవాద శక్తులు, వారి మీడియాతో సహా సమస్త రంగాలు.. వాళ్లు రాసిందే రాత గీసిందే గీతగా నడిచేదని గుర్తుచేశారు. అత్యంత శక్తివంతమైన ఆంధ్రా వ్యవస్థలను తట్టు కుంటూ, తెలంగాణ వ్యతిరేకతకు, సమైక్యవాదానికి సింబాలిక్‌గా ఉన్న నాటి పాలకుడు చంద్రబాబు నాయుడును ఎదిరించి నిలవడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదన్నారు. అలాంటి సమైక్యవాద కుటిల వ్యవస్థలనే బద్దలుకొట్టి తెలంగాణను సాధించి.. కలబడి నిలబడిన తెలంగాణ సమాజం, భవిష్యత్తులో ఎలాంటి ప్రతిబంధక పరిస్థితులనైనా అధిగమిస్తుందని భరోసా వ్యక్తం చేశారు.

గెలుపు ఓటములకు అతీతంగా తెలంగాణ సమాజం మనకు ఎల్లవేళలా అండగా ఉందని, భవిష్యత్తులోనూ ఉంటుందని కార్యకర్తల జై తెలంగాణ నినాదాల నడుమ కేసీఆర్ ప్రకటించారు.

శత్రువుల ప్రత్యర్థుల కుటిల యత్నాలను అధిగమిస్తూ అప్రతిహతంగా కొనసాగుతున్న బీఆర్ఎస్ విజయ ప్రస్థానంలో నిన్నటి ఓటమితో దిష్టి తీసినట్టయిందని, తిరిగి పునరుత్తేజంతో మరింతగా ప్రజాదరణను కూడగట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇచ్చిన అలవిగాని హామీలు అమలు చేయడం చేతగాక పలురకాల జిమ్మిక్కులతో ప్రజలను పక్కదారి పట్టిస్తూ పబ్బం గడుపుకుంటున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ నైజం మరోసారి అర్థమైన ప్రజలు, ఓటేసి పొరపాటు చేశామని నాలుక కరుసుకుంటున్నారని కేసీఆర్ స్పష్టం చేశారు.

తెలంగాణలో మున్నెన్నడూ లేనివిధంగా ప్రశాంతమైన పాలన ద్వారా పదేండ్లపాటు సంక్షేమం అభివృద్ధిని అందిస్తూ అన్ని తీర్లా అండగా నిలబడ్డ బీఆర్ఎస్ పార్టీని తిరిగి తెలంగాణ సమాజం కోరుకుంటున్నదని కేసీఆర్ తెలిపారు. కేసీఆర్ మీద ద్వేషంతో, అసంబద్ధ ప్రకటనలతో ప్రజా ఆకాంక్షలకు విరుద్ధంగా నడస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలు తిరుగబడే రోజులు త్వరలోనే రానున్నాయని స్పష్టం చేశారు. తన చేష్టలతో తానే ప్రజలచేత ఛీ కొట్టించుకోవడమే 50 ఏండ్ల కాంగ్రెస్ వైఖరి అనీ, ఈ నేపథ్యంలో ప్రజలు అనతికాలంలోనే కాంగ్రెస్ పాలనపై విరక్తి చెందారనే విషయం క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నదని సోదాహరణలతో కేసీఆర్ వివరించారు. 'మరికొద్ది రోజుల్లోనే టార్చ్‌లైట్ పట్టుకొని జనం దోలాడుకుంటా బీఆర్ఎస్ పార్టీకోసం వస్తారని' కేసీఆర్ ఆశాభావం వ్యక్తం చేస్తూ, అప్పటిదాక ఓపికతో ప్రజా సమస్యలపైన పోరాడుతూ వారికి అందుబాటులో ఉండాలని కార్యకర్తలకు అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనా చారి, తక్కెళ్ల పల్లి రవీందర్ రావు, కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, జీవన్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి, గొంగిడి సునీతా రెడ్డి, నలమోతు భాస్కర్ రావు, రమావత్ రవీంద్ర కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నోముల భగత్, బూడిద భిక్షమయ్య గౌడ్, కంచర్ల కృష్ణారెడ్డి, తిప్పన విజయసింహా రెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

# అవినీతి పరులు చట్టం నుంచి తప్పించుకోలేరు...

మొదటిపేజీ తరువాయి..

పేర్కొన్నారు. గత ఏడాది మేలో మణిపూర్‌లో చెలరేగిన హింసాకాండ దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. మణిపూర్ అల్లర్లపై ప్రధాని వివరణ ఇవ్వాలని మంగళవారం లోక్ సభలో ప్రతిపక్షాలు డిమాండ్ చేశారు. బీజేపీ మణిపూర్ లో హింసను ప్రోత్సహిస్తున్నాయని ప్రతిపక్షాలు ఆరోపించాయి. దీనిపై మోదీ బుధవారం రాజ్యసభలో మాట్లాడారు. మణిపూర్ లో శాంతి నెలకొల్పడానికి మా వంతు ప్రయత్నం చేస్తున్నామని ప్రధాని మోదీ అన్నారు. 11వేలకు పైగా ఎఫ్ ఐఆర్ హింసకు కారణమైన వారిపై నమోదు చేశామని, అందులో 500 మందిని అరెస్ట్ కూడా చేశామని ఆయన తెలిపారు. మణిపూర్ సమస్యను రాజకీయం చేయడం మానేయండని ప్రధాని విపక్షాలపై మండిపడ్డారు. చాలా ప్రాంతాల్లో ఇప్పుడు పరిస్థితులు చక్కబడ్డాయని మోదీ అన్నారు. హింసాత్మక సంఘటనలు తగ్గుముఖం పడుతున్నాయని వివరించారు. 2023 మేలో ఇంఫాల్ వ్యాలీకి చెందిన మెయిటీస్, కొండజాతి అయిన కుకీ వర్గాల మధ్య వర్గపోరు నడిచింది. దాదాపు ఇప్పటికీ వరకు ఆ అల్లర్లలో 200 మందికి పైగా చనిపోయారు. తాజాగా జూన్ లో కూడా మళ్లీ అక్కడ తెగలు ఘర్షణలకు దిగారు. అబద్ధాలు చెప్పే వారికి నిజాన్ని వినే శక్తి లేదన్నారు ప్రధాని మోదీ. తమ ప్రభుత్వం పదేండ్ల పాలన పూర్తి చేసుకుందని, ఇంకా ఇరవై ఏండ్లు మిగిలే ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రాజ్యాంగాన్ని తాము గౌరవిస్తామని, రాజ్యాంగం వల్లే తాను ప్రధాన మంత్రిని అయ్యానని చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వానికి రాజ్యాంగమే రక్ష అని చెప్పారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్తామని మోదీ చెప్పారు. తమపై విపక్షాలు ఎంత విష ప్రచారం చేసినా ప్రజలు నమ్మ లేదని, తమకే పట్టం కట్టారని అన్నారు. ప్రజాతీర్పును కొందరు జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. ఎంత చెప్పినా విపక్షం వినకపోవడం బాధాకరమని పీఎం అన్నారు. అరవై ఏండ్ల తర్వాత వరుసగా ఒక పార్టీ మూడో సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. వికసిత్ భారత్ సంకల్పంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. త్వరలోనే భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకోబోతున్నదని చెప్పారు. ఇదిలావుంటే రాజ్యసభలో విపక్షాల తీరుపై ఛైర్మన్ జగదీప్ ధన్కడ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ మాట్లాడుతుండగా రాజ్యసభలో ప్రతిపక్ష ఎంపీలు నీట్, మణిపూర్ అంశాలపై చర్చకు పట్టుబట్టారు. ప్రధాని అబద్దాలు చెబుతున్నారని నినాదాలు చేయడంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. అనంతరం ప్రధాని ప్రసంగాన్ని విపక్ష ఎంపీలు బహి ష్కరిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. దీంతో విపక్షాల తీరును ఛైర్మన్ ధన్కడ్ తప్పు పట్టారు. ఇది అత్యంత బాధకారమైన అమర్యాదకరమైన రోజన్నారు. ప్రతిపక్షాలతో చర్చలు జరిపి.. విజ్ఞప్తి చేసినా వినలేదన్నారు. వాళ్లు సభను కాదు.. మర్యాదను వదిలేశారంటూ వ్యాఖ్యలు చేశారు. విపక్షాలు రాజ్యాంగాన్ని అవమానించా యన్నారు. తనకు కాదు, వాళ్లు దేశ ప్రజలకు వెన్ను చూపారని... రాజ్యాంగానికి ఇంతకంటే ఘోర అవమానం ఉండదన్నారు. విపక్షం ఆత్మవిమర్శ చేసుకుంటుందని భావిస్తున్నానని ధన్కడ్ అన్నారు. ఈ క్రమంలో రాజ్యసభ నుండి బుధవారం ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి.

ప్రస్తుత సమస్యలపై చర్చ జరపాలన్న ప్రతిపక్షాల నినాదాలను పట్టించుకోకుండా రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై ప్రధాని మాట్లాడారు. కాంగ్రెస్ మాజీ చీఫ్, రాజ్యసభ ఎంపి సోనియాగాంధీపై ప్రధాని విమర్శలు గుప్పించారు. ఈ వ్యక్తులు ఆటోపైలెట్, రిమోట్ పైలెట్‌లతో ప్రభుత్వాన్ని నడపడానికి అలవాటు పడ్డారు. వారికి పనిమీద నమ్మకం లేదు. వేచి చూడటమే వారికి తెలుసు అంటూ గత మన్‌మోహన్ సింగ్ ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తూ వాకౌట్ చేశాయి. ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ వారిస్తున్నప్పటికీ.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సహా పలువురు ప్రతిపక్ష ఎంపిలు వాకౌట్ చేశాయి. ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేకు అవకాశం ఇవ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. విపక్షనేతను మాట్లాడేందుకు అనుమతించడం అంటూ నినాదాలు చేశారు. మాట్లాడేందుకు అనుమతించాలని ఖర్గే కూడా పదేపదే అభ్యర్థించారు. తాము తమ అభిప్రాయాలను తెలిపేందుకు అవకాశమివ్వాలని కోరారు. అసత్యాలు చెప్పడం ఆపండి. సిగ్గు పడండి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఛైర్మన్ సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

## ఆర్ అండ్ బీ సెక్షన్‌లో మంత్రి కోమటిరెడ్డి ఆకస్మిక తనిఖీలు

హైదరాబాద్,జూలై3 (నమస్తే ఉదయం): ఆర్ అండ్ బీ సెక్షన్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆర్ అండ్ బీ విభాగాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పరిశీలించారు. సచివాలయంలో ఉద్యోగుల పనితీరును తెలుసుకునేందుకు మంత్రి వెళ్లారు. అక్కడి పరిస్థితి చూసి నిర్ఘాంతపోయారు. ఆర్ అండ్ బీ విభాగంలో ఆకస్మికంగా తనిఖీ చేయగా ఖాళీ కుర్చీలే దర్శనమివ్వడంతో షాక్ తిన్నారు. సమయం దాటినా చాలా మంది ఉద్యోగులు కార్యాలయానికి రాకపోవడంతో మంత్రి వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణంగా ఉద్యోగులు ఉదయం 10 గంటలకు కార్యాలయానికి రిపోర్టు చేయాలి. తెలంగాణ సచివాలయంలో ఉదయం 11.00 గంటలు అయిన 80 శాతం ఉద్యోగులు ఆఫీసులకు రాకపోవడంపై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసిస్టెంట్, అడిషనల్ సెక్రటరీ స్థాయి అధికారులు కూడా ఆఫీసులకు ఆలస్యంగా రావడంపై ప్రశ్నించారు. 11కి రాలేదు.. మళ్లీ 6కి వెళ్లిపోతారు..

మళ్లీ మధ్యలో ఆఫ్ అంటూ.. అధికారుల తీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పాటు పలు వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి.. కొన్ని విషయాలపై అధికారులు స్పందించకపోవడంతో మీ వివరాలు కూడా మీకు తెలుసా? అంటూ ఫైర్ అయ్యారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని వార్నింగ్ ఇచ్చారు. ఇలాగే కొనసాగితే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మంత్రి వచ్చిన ఇప్పటి వరకు ఉద్యోగులు రాకపోవడం ఏంటని మండిపడ్డారు. ఉద్యోగులు రోజూ ఇలానే వస్తున్నారా? అంటూ ప్రశ్నించారు. మొదటిసారి తనిఖీ కావడంతో.. వదిలేస్తున్నాని ఇదే మళ్లీ రిపీట్ అయితే.. చర్యలు తప్పవని హెచ్చరించారు.

# జులై 12 వరకు కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ,జూలై3 (నమస్తే ఉదయం): ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు మరోసారి నిరాశ ఎదురైంది. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్ కస్టడీ జులై 12 వరకు పొడిగిస్తూ రూజ్ అవెన్యూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కాగా గత శనివారం సీబీఐ కేసులో కేజ్రీవాల్ కస్టడీని జులై 12 వరకు పొడిగిస్తూ కోర్టు ఆదేశాలిచ్చింది. సీబీఐ కేజ్రీవాల్‌ను జూన్ 26న అరెస్ట్ చేసింది. ఈ ఉదయం, కేజ్రీవాల్ తనపై సీబీఐ కేసుకు సంబంధించి ఢిల్లీ హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 41ను పాటించకుండా కేజ్రీవాల్‌ను అక్రమ కస్టడీలోకి తీసుకున్నారని ఆరోపిస్తూ బెయిల్ పిటిషన్‌ను గురువారం లిస్ట్ చేయాలని అతని న్యాయవాది రజత్ భరద్వాజ్ కోర్టును కోరారు. అయితే ఈ పిటిషన్‌పై స్పందించిన కోర్టు శుక్రవారం జాబితా చేసింది. మనీలాండరింగ్ కేసుకు సంబంధించి మార్చి 21న ఈడీ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసింది. గత నెల 20న రూజ్ అవెన్యూ కోర్టు బెయిల్ మంజూరు చేయగా ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది.

# సమగ్ర నివేదిక ఇవ్వండి

మొదటిపేజీ తరువాయి..

సరఫరా పై ప్రస్తుతం జరుగుతున్న సర్వే, అది ఎప్పుడు పూర్తవుతుంది తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే పూర్తికాగానే రాష్ట్రంలోని అందరు ఎమ్మెల్యేలకు ఆ నివేదికలు అందజేసి తాగునీరు అందుతుందన్న విషయాన్ని వారి ద్వారా నిర్ధారణ చేసుకోవాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. 42 వేల కోట్లు ఖర్చు చేసిన ఇంకా తాగునీటి ఎద్దడి ఉందని కొత్తగూడెం, ఆలేరు అంటే నియోజకవర్గాల్లో అదనపు నిధులు కోరుతున్నారు.. ఇదేంటని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని మున్సిపాలిటీలకు హైదరాబాద్ మెట్రో నుంచి తాగునీటిని సరఫరా చేస్తుండగా ఆయా మున్సిపాలిటీలు మిషన్ భగీరథ కింద మంచి రెడ్డి సరఫరా చేస్తున్నట్టు రికార్డుల్లో ఎందుకు చూపిస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. తాగునీటి సరఫరా కి ప్రధాన సోర్స్ ను వందల కిలోమీటర్ల నుంచి కాకుండా ప్రతి సమీపంలో నుంచి తీసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి తీసుకోవడం మూలంగా తరచూ పైప్‌లైన్‌లు పగిలిపోవడం వంటివి ఉత్పన్నమై తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. మిషన్ భగీరథ పథకం కింద పనిచేస్తున్న సిబ్బంది జీవితాలు నెలల తరబడి ఎందుకు పెండింగ్లో ఉంటున్నాయి అని ప్రశ్నించారు. ఒక్కో ప్రాంతంలో ఒకరకంగా కార్మికుల వేతనాలు ఉంటున్నాయి, 8000 నుంచి 13 వేల వరకు అందుతున్నట్టు నాకు సమాచారం ఉంది. ప్రభుత్వం అందిస్తున్న వేతనాల నిధుల్లో ఎక్కువ మొత్తం ఏజెన్సీలు కట్ చేసుకుని మిషన్ భగీరథ కార్మికులకు తక్కువ జీతాలు ఇస్తున్నారు దీనిపై సమీక్ష చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న వేతనాలు కార్మికులకు ప్రయోజనం చేకూర్చాల తప్ప మధ్య భక్తులకు కాదని అన్నారు. రాష్ట్రంలో మొత్తం ఉన్న ఏజెన్సీలు ఎన్ని, ప్రభుత్వం ఇస్తున్న వేతనాలు, ఏజెన్సీలు కార్మికులకు ఇస్తున్న వేతనాల వివరాల తో సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ కార్మికులకు రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకంగా వేతనాలు ఉండేలా ఫిక్స్ చేయాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పథకం కోసం చేసిన వేల కోట్ల అప్పు చెల్లిస్తున్న పథకం ప్రయోజనం పూర్తిస్థాయిలో నెరవేరడం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కమాలు అన్నారు.

## నేడు దేశవ్యాప్తంగా స్కూళ్లు, కాలేజీలు బంద్

మొదటిపేజీ తరువాయి..

మొదటి బోనం సమర్పించి బోనాలు ప్రారంభమవుతాయి. ఈ క్రమంలో జూలై 27వ తేదీని రాష్ట్ర సెలవు దినంగా ప్రకటించారు. ఆ రోజు శనివారం మరియు మరుసటి రోజు జూలై 28 ఆదివారం. ఈ లెక్కన రెండు రోజుల సెలువు రాబోతోంది.

# కాంగ్రెస్‌లో చేరిన కెకె

మొదటిపేజీ తరువాయి..

పాల్గొన్నారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ ఫోన్ చేశారని, పార్టీలోకి రావాలని కోరారని కే.కేశవ రావు తెలిపారు. ప్రియాంక గాంధీ కోరడంతో పార్టీలోకి వచ్చేందుకు సరేనని చెప్పినట్టు కేకే పేర్కొన్నారు.

కాగా బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ చేరాలని ఈ ఏడాది మార్చి నెలలోనే నిర్ణయించుకున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డితో భేటీ కూడా అయ్యారు. ఆ తర్వాత మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి పార్టీని వీడుతున్నట్టు కేకే చెప్పారు.. ఈ సందర్భంగా కేసీఆర్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్టు అప్పట్లో వార్తలు కూడా వచ్చాయి. 'మీ కుటుంబానికి పార్టీ ఏం తక్కువ చేసింది' అని కేసీఆర్ అడిగినట్టు కథనాలు వెలువడ్డాయి. కేసీఆర్‌తో భేటీ అనంతరం బీఆర్ఎస్‌ను వీడుతున్నట్టు కే కేశవ రావు ప్రకటించిన విషయం తెలిసిందే. చనిపోయే వరకూ కాంగ్రెస్ లోనే ఉంటాను. కాంగ్రెస్ తనకు సొంత ఇల్లులాంటిదని, తీర్థయాత్రలకు వెళ్లిన వారు ఎప్పటికైనా ఇంటికే చేరుతారు. నేను కూడా నా సొంత ఇల్లు కాంగ్రెస్‌లో చేరుతున్నాను. 53 ఏళ్లు కాంగ్రెస్‌లో పని చేశాను. బీఆర్ఎస్‌లో నేను పని చేసింది కేవలం పదేళ్లే' అని అప్పట్లో కేకే అన్నారు. కాగా కేకే కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ముందే ఆయన కుమార్తె విజయలక్ష్మి కూడా హస్తం పార్టీలో చేరారు. ఆయన కేకే కొడుకు మాత్రం బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని చెప్పారు.

## తెలంగాణ పిసిపి చీఫ్ ఎంపిక వాయిదా

మొదటిపేజీ తరువాయి..

ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్కలు సైతం అధ్యక్ష పదవిని అడుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. పీసీసీ అధ్యక్షుడి నియామకం తర్వాతే మంత్రివర్గ విస్తరణ ఉండొచ్చని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే సిఎం రేవంత్ ఢిల్లీ చేరుకుని ఈ విషయంలో చర్చించారు. అయితే ఏకాభిప్రాయం తరవాతనే చర్చించాలన్న ఆలోచనతో వాయిదా వేసినట్లు సమాచారం.

# ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ వెనకడుగు

మొదటిపేజీ తరువాయి..

అమలు ఏమైంది? డిసెంబర్ 9న రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నేతలకు మ్యానిఫెస్టో మీద కూడా గౌరవం లేదు. తొలుత రుణమాఫీ అన్నారు. తొమ్మిది నెలలు కావొస్తున్నా రుణమాఫీ ఊసే లేదు. అభయహస్తం మ్యానిఫెస్టోలో వరి ధాన్యానికి రూ.2683 రూపాయల మద్దతు ధర ఇస్తామని చెప్పిన హామీ ఏమైంది? డిసెంబర్ 9న రుణమాఫీ ఎందుకు చేయలేదు? ఇందిరమ్మ రైతు భరోసా ఎక్కడ? వడ్డీ లేని రుణం ఇస్తామన్నారు.. ఏమైంది? అంటూ ప్రశ్నలు కురిపించారు.

పంద్రాగస్టు కల్లా రుణమాఫీ చేస్తామని భువనగిరిలో లక్ష్మీ నరసింహస్వామి, మెదక్‌లో ఏడుపాయల దుర్గమ్మ మీద సీఎం రేవంత్ రెడ్డి ఒట్లు వేశారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా కాంగ్రెస్ పాలకులు టైం పాస్ చేస్తున్నారు. రేవంత్ రెడ్డి అడుగులు తడబడుతున్నాయి. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అయ్యేనాటికి మరో 15 మంది ఎమ్మెల్యేలను కాపాడుకోలేని పరిస్థితి భారాసలో నెలకొంది. మరో 15 నెలల్లో భారాస పార్టీ ఉంటుందా? అనే అనుమానం వస్తోంది. ఐదు రోజులు దిల్లీలో ఉన్న రేవంత్ రెడ్డి రాజకీయాలు తప్ప అభివృద్ధి కోసం ఆలోచించ లేదు' అని రఘునందన్ రావు వ్యాఖ్యానించారు. విబజన సమస్యలపై ఇద్దరు సిఎంలు చర్చించాలనుకోవడం మంచిదేనని అన్నారు.

గత పదేళ్లలో కెసిఆర్ ఇలాంటి చొరవ తీసుకోలేదన్నారు. జగన్‌తో అలయ్ భలయ్ చేసుకున్నా ఎందుకు సమస్యలు ప్రస్తావించలేదన్నారు.

## బండ్లగూడ మున్సిపల్ కార్పోరేషన్‌లో కార్పొరేటర్లపై దాడి చేసిన ముగ్గురితో పాటు ఇతరులపై ఎస్సీ ఎస్టీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు

**రాజేంద్రనగర్, జూలై3(నమస్తే ఉదయం):**
గత ఆదివారం బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన హరితహారం కార్యక్రమంలో మేయర్, మాజీ మేయర్ వర్గీయులు గొడవకు పాల్పడడం కొట్టుకోవడం గురించి తెలిసిందే. ఈ సంఘటనలో తమపై దాడి చేసిన వారి గురించి కార్పొరేటర్లు చంద్రశేఖర్, శ్రీనాథ్ రెడ్డిలు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను కులం పేరుతో తిట్టి చొక్కా చింపి వేసి గాయపరిచారని కార్పొరేటర్ చంద్రశేఖర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు హరీష్ గౌడ్, శివా గౌడ్, మల్లేష్ గౌడ్, ఇతరులపై ఎస్సీ ఎస్టీ యాక్ట్‌తో పాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

## ఉపాధ్యాయులకు సన్మానం

**గద్వాల, జూలై3(నమస్తే ఉదయం):** ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీలలో భాగంగా గద్వాల జిల్లాలోని వివిధ పాఠశాలలను చెందిన ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు.



జిల్లాలోని బిజ్వారం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న జి.భరత్‌తో పాటు ఐదుగురు ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు.

## రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో చోరికి గురైన 24 సెల్‌ఫోన్లు స్వాధీనం

**రాజేంద్రనగర్, జూలై3(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన 24 సెల్ ఫోన్ లను పోలీసులు స్వాధీనం చేసుకుని వాటి యజమానులకు అప్పగించారు . బుధవారం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయం లో డీసీపీ చింతమనేని




సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారికి వాటిని అప్పచెప్పిన పోలీసులు

శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 24 మంది తమ సెల్ ఫోన్లు పోయాయని ఫిర్యాదు చేసారని తెలిపారు. సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటి రిజిస్టర్ పోర్టల్ ద్వారా పోయిన సెల్ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకొని వాటి యజమానులకు అప్పగించామన్నారు. టెలి కమ్యూనికేషన్స్ డిపార్ట్మెంట్ సీఈఐఆర్ పోర్టల్ ప్రవేశపెట్టిందని, ఎవరైనా తమ ఫోన్ చోరీకి గురైనప్పుడు ఆ పోర్టల్‌లో ఫిర్యాదు చేయవచ్చున్నారు.

## కాకతీయ ప్రైవేటు పాఠశాలలో పాఠ్యపుస్తకాలు పట్టుకున్న ఏబీవీపి విద్యార్థులు

**పాఠశాలలో పుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేసిన మండల విద్యాశాఖ అధికారి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 3(నమస్తే ఉదయం):**
జిల్లా కేంద్రంలో కాకతీయ ప్రైవేట్ పాఠశాలలో అక్రమంగా పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, స్కూలు యూనిఫామ్స్ నిల్వ ఉంచారన్నా సమాచారంతో బుధవారం ఏబీవీపీ విద్యార్థులు పాఠశాలలో అకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా




పాఠ్యపుస్తకాలు, బుక్స్ ఉన్నాయని గుర్తించి మండల విద్యాశాఖ అధికారికి సమాచారం అందించారు. ఎంఈఓ కాకతీయ పాఠశాలలో ఒక గదిలో నిల్వ ఉంచిన పరిశీలించారు. నిబంధనల విరుద్ధంగా బుక్స్ ఉన్న గదిని సీజ్ చేశారు. జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో




నిబంధనలకు విరుద్ధంగా నోట్ బుక్స్, యూనిఫార్మ్ ఇతర ఇతర సామాగ్రి విద్యార్థులకు అమ్మినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.







# విద్యతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

**- ఎమ్మెల్యే కృష్ణమ్మోహన్ రెడ్డి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 3(నమస్తే ఉదయం):**
తరగతి గదులలో బోధించే విద్యతోనే అభివృద్ధి సాధ్యమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం గట్టు మండలం పరిధిలోని వాయిలకుంట తండా రూ.12 లక్షల ఎంపీపీ నిధులతో నిర్మించిన పాఠశాల అదనపు గది, తారాపురం గ్రామంలో రూ.12 లక్షల ఎంపీపీ నిధులతో నిర్మించిన పాఠశాల అదనపు గది, ముచ్చోనిపల్లి గ్రామంలో రూ.12 లక్షల ఎంపీపీ నిధులతో నిర్మించిన పాఠశాల అదనపు గదని గద్వాల ఎమ్మెల్యే ప్రారంభించారు. తప్పెట్ల మొర్సు గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన పాఠశాల కాంపౌండ్ వాల్ , ఆధునిక భవనాన్ని ఎమ్మెల్యే బండ్ల ప్రారంభించారు. అనంతరం తప్పెట్ల మొర్సు గ్రామంలో పాఠశాల ఆవరణంలో విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే సహబంతి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో తొలి సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి మన ఊరు మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అందులో భాగంగా మొదటి విడత నియోజకవర్గంలో కొన్ని పాఠశాలను ఎంపిక చేసి నిర్మించినట్లు తెలిపారు.

గతంలో ఈ గ్రామాలలో సరైన పాఠశాల లేక పిల్లలు చదువుకోలేక ఇబ్బందులు పడేవారని తొలి సిఎం కేసీఆర్ నాయకత్వంలో పాఠశాలలను ఏర్పాటు చేసుకొని జరిగిందన్నారు. ప్రతి ఒక్క పిల్లవాడు చదువుకోవాలని ముఖ్య లక్ష్యంతో గ్రామీణ పాఠశాలలను అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న విద్యార్థులకు అన్ని విధాలుగా ఉచితంగా స్కూల్ యూనిఫామ్ మధ్యాహ్నం భోజనము, క్రీడా ప్రాంగణము, గురుకుల పాఠశాలలను చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉచిత భోజనము హాస్టల్ సౌకర్యము ఇంగ్లీష్ విద్యను అందిస్తూ ప్రవేట్ పాఠశాలకు దీటుగా గవర్నమెంట్ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యతమైన విద్యను అందిస్తూ ప్రతి ఒక్కరూ చదువుకోవాలని గొప్ప లక్ష్యంతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో పేద ప్రజలు కూడా చదువుకోవాలని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని విధాలుగా విద్యను అందిస్తూ పిల్లలు బడికి పెద్దలు పనికి అని నినాదాన్ని తెలిపారు. ప్రతి ఒక్కరు గ్రామాలలో పిల్లలకు బడిలో పంపేయాలి చదువుకోవడం వల్లనే నేటి సమాజంలో చదువు ఉంటేనే జ్ఞానం తెలివి లభిస్తుంది. భవిష్యత్తులో మీ పిల్లలు అత్యంత స్థాయికి ఎదిగి మీకు గ్రామానికి మంచి పేరు ఇచ్చే పైకి విధంగా కృషి చేయడానికి మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. గ్రామాల అభివృద్ధి కోసం నా వంతు సహాయం సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయ్ జెడ్పిటిసి బాసు శ్యామల, పి ఏ సి ఎస్ ఛైర్మన్ వెంకటేష్, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడ, ఎంపీటీసీ ఆనంద్ గౌడు, రంగస్వామి, పారిజాత, జెడ్పీ కో ఆప్షన్ నెంబర్ ఇమాన్, మండలం కో ఆప్షన్ నెంబర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు హనుమంతు నాయుడు, గద్వాల తిమ్మప్ప ,ఆలూరు రామయ్య శెట్టి, ఆంజనేయులు గౌడ్, మహేశ్వర్ రెడ్డి,చిన్న గోవిందు, జయన్న రామకృష్ణ నాయుడు, నరేందర్ నాయక్ నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.జెడ్పిటిసి బాసు శ్యామల, పిఎసిఎస్ ఛైర్మన్ వెంకటేష్, ఎంపీటీసీలు ఆనంద్ గౌడు, రంగస్వామి, పారిజాత జెడ్పీ కో ఆప్షన్ నెంబర్ ఇమాన్, మండలం కో ఆప్షన్ నెంబర్ వహబ్ సబ్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు హనుమంతు నాయుడు, గద్వాల తిమ్మప్ప , శ్రీనివాస్ రెడ్డి, ఆలూరు రామయ్య శెట్టి, మహేశ్వర్ రెడ్డి,చిన్న గోవిందు,రామకృష్ణ నాయుడు, షాద్రిక్ , నర్సింహులు సోమశేఖర్ , ఆంజనేయులు జయన్న , మూణ్య నాయక్ సోమ్లానాయక్ నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





పీస్ కమిటీ ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతున్న హైదరాబాద్ సిపి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

# మొహరం, బోనాల ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

**- సిపి కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి**

**ప్రపంచంలోనే శాంతియుతంగా హైదరాబాద్**

**హైదరాబాద్,జూలై3(నమస్తే ఉదయం):**
ప్రపంచవ్యాప్తంగా ప్రశంసించబడిన హైదరాబాద్ శాంతి యుత వాతావరణాన్ని కొనసాగించడానికి ఇలాంటి నిరంతర సహకారం అందించాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్త కొత్త శ్రీనివాస్ రెడ్డి అభ్యర్థించారు.

బుధవారం హైదరాబాద్ బంజారాహిల్స్ లోని టిజిసి, సిసి మీడియా బ్రీఫింగ్ హాల్‌లో బోనాలు పండుగ, మొహర్రం ఉత్సవాలపై సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...హైదరాబాద్ గత కొన్ని దశాబ్దాలుగా సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ చేస్తున్న నిబద్ధత , కృషిని ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఇస్ కమిటీ జనరల్ సెక్రెటరీ కిషన్ శర్మ, సెంట్రల్ పీస్ & వెల్ఫేర్ కమిటీ, హాఫీజ్ ముజఫర్ హుస్సేన్, చీఫ్ ప్యాట్రన్, అన్ని జోనల్ అధ్యక్షులు, అడిషనల్ కమిషనర్ (లా & ఆర్డర్) విక్రమ్ సింగ్ మాన్, కమిటీ ఛైర్మన్, శ్రీ పి.విశ్వ ప్రసాద్, అడిషనల్ కమిషనర్ వి.సత్యనారాయణ, డీసీపీలు, ఏడు మండలాల అదనపు డీసీపీలు పాల్గొన్నారు.

పోలీసు అధికారులతో మరింత తరచుగా సంభాషించాలని ,వివిధ సమస్యలు , సామాజిక వ్యతిరేక అంశాలకు సంబంధించిన ఇన్‌పుట్‌లను పంచుకోవాలని ఆయన కమిటీ సభ్యులను అభ్యర్థించారు.

కిషన్ శర్మ పోలీస్ డిపార్ట్మెంట్‌కు వారి సిద్ధంగా అందు బాటులో ఉన్న పగలు,రాత్రికి పూర్తి మద్దతును తెలిపారు.

ఈ సందర్భంగా హైదరాబాద్ నగరంలోని పలు మండలాలకు చెందిన దాదాపు 50 మంది కేంద్ర శాంతి సంక్షేమ కమిటీ కార్యాలయ అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.





# గ్రామాల అభివృద్ధికి పెద్దపీట..

**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఆవిష్కరణ : ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**

**శంషాబాద్,జులై03(నమస్తే ఉదయం):**
గ్రామాల అభివృద్దే లక్ష్యంగా తాను నిరంతరం పనిచేస్తున్నట్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. రూ.1.23 కోట్ల నిధులతో బుధవారం శంషాబాద్ మండలంలోని నర్ఖూడ గ్రామపంచాయతీలో సీసీ రోడ్లు,బీసీ కమ్యూనిటీ హాల్,పాఠశాల అదనపు తరగతి గదులు, వివిధ అభివృద్ధి పనులను శంషాబాద్ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్,జడ్పీటీసీ నీరటీ తన్వీరాజ్ తో కలిసి ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

ముఖ్యంగా గ్రామాల అభివృద్ధి కొరకు ప్రత్యేకంగా ప్రణాళికను రూపొందించి నిధులు తీసుకొచ్చి ప్రజలకు మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు.నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా జడ్పిటిసి తన్వి రాజు నర్కుడ గ్రామంలో ప్రత్యేక నిలువు తీసుకొచ్చి అభివృద్ధి చేశారని ఎమ్మెల్యే వారిని ప్రత్యేకంగా అభినందిచారు. అనంతరం తెలంగాణ సాయుధ పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రజలు ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ...బహుజనుల అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేసిన పాపన్నగౌడ్ ఆదర్శప్రాయుడని,ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు.

ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.మహనీయులు ఏ ఒక్క కులం కోసం కాకుండా అందరి కోసం పాటుపడ్డారని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న ఆనాటి పాలకుల అరాచకాలను అణిచివేసి అణగారిన వర్గాల పేదల కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి పోరాడారని గుర్తు చేశారు.ప్రతిఒక్కరూ వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బుర్కుంట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్ రాష్ట్రంలో భారీ వర్షాలు

**వరద నీటిలో మునిగిన పలు ప్రాంతాలు**

**బిష్ణుపూర్,జూలై3 (నమస్తే ఉదయం):**
మణిపూర్ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తుం డటంతో.. జనజీవనం అస్తవ్యస్తం అయింది. పలు ప్రాంతాలు వరద నీటిలో మునిగి పోయాయి.

ఈ నేపథ్యంలో రాష్ట్ర గవర్నర్ అనుసూయ ఉయికే రాష్ట్ర వ్యాప్తంగా సెలవు ప్రకటించింది. దీంతో ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, అటానమస్ బాడీలు, ప్రభుత్వ పరిధిలోని సొసైటీలు, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు, స్కూల్స్, కాలేజీలను మూసివేశారు. కాగా, మరోవైపు మణిపూర్ విద్యాశాఖ డైరెక్టరేట్ సైతం రాష్ట్రంలో వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యగా జూలై 3, 4 తేదీల్లో అన్ని పాఠ శాలలకు సెలవులు ఇస్తున్నట్లు ప్రకటించారు.

అయితే, గతకొన్ని రోజులుగా రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మణిపూర్ లోని పలు నదులు, సరస్సులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.

ఇంఫాల్ వెస్ట్, ఇంఫాల్ ఈస్ట్, కాంగ్‌పోక్పి, సేనాపతి, తౌబాల్, బిష్ణుపూర్ జిల్లాల్లోని పలు ప్రాంతాలను సైతం వరదలు ముంచెత్తాయి. అయితే, మణిపూర్ రాష్ట్రంలోని ప్రధాన నదుల నీటి మట్టాలు క్రమంగా రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉండటంతో బలహీనమైన కట్టడాల్లో నివాసం ఉండరాదని, సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని ప్రజలకు అధికారులు విజ్ఞప్తి చేశారు.



## విక్టరీ వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబో ప్రారంభం

విక్టరీ వెంకటేష్, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి వారి కాంబినేషన్లో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ప్రొడక్షన్ నెం. 58 కోసం హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్లను పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నారు. రెండు హిలేరియస్ హిట్‌ల- ఎఫ్2, ఎఫ్3 తర్వాత వారు ఒక ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ కోసం మరోసారి చేతులు కలిపారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ చిత్రం ఈ రోజు హైదరాబాద్‌లో అత్యంత గ్రాండ్‌గా ప్రారంభమైంది. ముహూర్తం షాట్‌కు సురేష్ ప్రొడక్షన్స్ నిర్మాత సురేష్ బాబు కెమెరా స్విచాన్ చేయగా, గీతా ఆర్ట్స్ నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. దర్శకుడు వంశీ పైడిపల్లి స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందజేశారు. లెజెండరీ డైరెక్టర్ రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ న్యూ మూవీ హీరో, అతని ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, అతని ఎక్స్ లెంట్ వైఫ్.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ఎక్స్ ట్రార్డినరీ ట్రైయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ ముగ్గురూ ఇప్పటికే రెండు బ్లాక్‌బస్టర్‌లను అందించిన నేపథ్యంలో, వారి కాంబినేషన్‌లో మరో చిత్రం కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## సికిందర్ సొగసులు

బాలీవుడ్‌లో అడుగు పెట్టి రెండు దశాబ్దాలకు పైగా పూర్తి అయినా కూడా ఇంకా ఏమాత్రం అందం తగ్గకుండా పాతికేళ్ల పడుచు అమ్మాయిలతో అందం విషయంలో పోటీ పడుతున్న సీనియర్ ముద్దుగుమ్మ షామా సికిందర్. సినిమా మరియు బుల్లి తెరపై ఈ అమ్మడు తనదైన ముద్ర వేసింది. నాలుగు పదుల వయసులో కూడా అందాల ఆరబోత విషయంలో కొత్త హీరోయిన్స్ కి పోటీ అన్నట్లుగా నిలుస్తున్న ముద్దుగుమ్మ షామా సికిందర్ తాజాగా బ్యాంకాక్ లో సందడి చేస్తుంది. అక్కడ బీచ్ ల్లో, పరిసర ప్రాంతాల్లో చక్కర్లు కొడుతూ ఆ ఫోటోలను ఇన్ స్టా ద్వారా తన ఫాలోవర్స్ తో షేర్ చేసుకుంటూ ఉంది. తాజా ఫోటో షూట్ లో అందాల షామా సికిందర్ పింక్ స్కిన్ టైట్ టాప్ లో అందాలను చూపిస్తూ కన్నుల విందు చేస్తుంది. ఈ వయసులో ఇంతటి అందం కేవలం షామా కే సాధ్యం కావచ్చు అన్నట్లుగా ఆమె ఫాలోవర్స్ కామెంట్స్ చేస్తున్నారు.



## ఆగస్టు 2న "ఆపరేషన్ రావణ్"

రక్షిత్ అట్లూరి హీరోగా రాధికా శరత్ కుమార్ ముఖ్య పాత్రలో నటిస్తున్న కొత్త సినిమా "ఆపరేషన్ రావణ్". ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి నిర్మాణంలో న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్ గా దర్శకుడు వెంకట సత్య తెలుగు మరియు తమిళ బాషల్లో రూపొందిస్తున్నారు. సంగీర్తన విపిన్ హీరోయిన్‌గా నటిస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న "ఆపరేషన్ రావణ్" సినిమా రిలీజ్ డేట్ ను ఈరోజు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు వారు వెల్లడించారు. "ఆపరేషన్ రావణ్" రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌పై ఓ సైకో స్టోరీ అనే క్యాప్షన్ పెట్టారు. యాక్షన్ సీక్వెన్సులోని హీరో రక్షిత్ అట్లూరి స్టిల్‌తో డిజైన్ చేసిన ఈ పోస్టర్ ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తోంది.

"ఆపరేషన్ రావణ్" సినిమాలో రాధికా శరత్ కుమార్, చరణ్ రాజ్, తమిళ నటుడు విద్యాసాగర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తు న్నారు. ఈ సినిమా విజయంపై మూవీ టీమ్ కాన్ఫి డెంట్‌గా ఉన్నారు.

## సరైన సమయంలో సహాయం చేసేవాడు దేవుడు

నా పుట్టినరోజు సందర్భంగా రామ్ చరణ్ అన్న ఇంటికి పిలిచినపుడు వారికి నా మీదున్న ప్రేమకి చాలా సంతోషపడ్డా. అక్కడికి వెళ్ళాక మెగాస్టార్ చిరజీవి గారి ఆశీర్వాదం తో పాటు చరణ్ అన్న ఉపాసన కొణిదెల వదిన నాకు ఇచ్చిన మాటకి నా సంతోషం 1000 రెట్లు పెరిగింది. నేను ఇదివరకు అడిగిన సహాయాన్ని గుర్తుంచుకుని మా డ్యాన్సర్స్ యునియన్ టి. ఎఫ్. టి. టి. డి. ఎ లో 500ం కుటుంబాలకి హెల్త్ ఇన్సూరెన్స్ అందేలా వారు అండగా నిలబడతామన్నారు. అడిగిన సహాయాన్ని గుర్తుంచుకుని, ఇచ్చిన మాటకి విలువనిస్తూ, అన్ని కుటుంబాలని చేరదీయడం మామూలు విషయం కాదు. మా అందరి మనసులో కృతజ్ఞత భావం ఎల్లకాలం ఉంటుంది.





## "చిట్టి పొట్టి" గ్లిమ్స్‌కు అనూహ్య స్పందన

భాస్కర గ్రూప్ ఆఫ్ మీడియా బ్యానర్ పై భాస్కర్ యాదవ్ దాసరి దర్శకత్వం వహిస్తూ నిర్మించిన చిత్రం చిట్టి పొట్టి. రామ్ మిట్టకంటి, పవిత్ర, కస్వి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అన్న చెల్లెలి అనుబంధంతో నడిచే ఈ సినిమాలో భావోద్వేగాలు, తెలుగుదనం అనురాగాలు, ఆప్యాయతలు ఉంటాయి. మూడు తరాలలో చెల్లెలుగా, మేనత్తలుగా, బామ్మ గా ... ఒక అడబిడ్డకి పుట్టింటి పైన ఉన్న ప్రేమ, మమకారం ను తెలిపే చిత్రం. ప్రతి ఇంట్లో ఉండే ఆడపిల్ల విలువ తెలియజేసే సినిమా ఇది. చిట్టి పొట్టి టైటిల్ , మరియు మోషన్ పోస్టర్ కు చక్కటి ఆదరణ లభించింది, అలాగే ఇటీవల విడుదల చేసిన ఈ చిత్ర గ్లిమ్స్ కు విశేష ఆదరణ లభిస్తోంది. సోషల్ మీడియాలో గ్లిమ్స్ లోని డైలాగ్స్ వైరల్ అవ్వడం విశేషం. ఫ్యామిలీ ఎమోషన్స్ తో కూడిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుందని దర్శక నిర్మాత భాస్కర్ యాదవ్ దాసరి తెలిపారు.

## 'డబుల్ ఇస్మార్ట్' సాంగ్


ఉస్తాద్ రామ్ పోతినేనిన్, డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాధ్ 'డబుల్ ఇస్మార్ట్' హైలీ యాంటిసిపేటెడ్ పాన్-ఇండియన్ ప్రాజెక్ట్, మచ్ ఎవైటెడ్ ఇస్మార్ట్ శంకర్ కి సీక్వెల్. పూరి కనెక్ట్స్ బ్యానర్‌లో పూరి జగన్నాధ్, ఛార్మి నిర్మించారు. ఈ సినిమా ఆగస్ట్ 15న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. దేశవ్యాప్తంగా ఈ చిత్రాన్ని దూకుడుగా ప్రమోట్ చేయాలని మేకర్స్ చూస్తున్నారు, టీజర్‌కు సెన్సేషనల్ రెస్పాన్స్ వచ్చిన తర్వాత టీం ఇప్పుడు ఫస్ట్ సింగిల్ స్టెప్పా మార్‌తో మ్యూజిక్ ప్రమోషన్‌లను ప్రారంభించింది. స్టెప్పా మార్ ట్రూలీ మాస్ డ్యాన్స్, రిథమ్, హై ఎనర్జీని సెలబ్రేట్ చేసుకునే సాంగ్. ఉస్తాద్ రామ్ పోతినేని అద్భుతమైన పెర్ఫార్మెన్స్, పూరి జగన్నాధ్ స్టైలిష్ టేక్ విజువల్ మాస్ ఫీస్ట్ లా వుంది.

వోకల్స్, లిరిక్స్ లిజనర్స్ కి గొప్ప ఉత్సాహాన్ని ఇచ్చాయి. ఇన్ఫెక్షియస్ బీట్‌లు, ఆకట్టుకునే లిరిక్స్ దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులతో ప్రతిధ్వనిస్తూ స్టెప్పామార్ మాస్ సాంగ్ ఆఫ్ ది ఇయర్ గా నిలిచింది. మణిశర్మ కంపోజ్ చేసిన స్టెప్ప మార్ ఇన్స్టంట్ చార్ట్‌బస్టర్, ఇది మ్యూజిక్ ప్రమోషన్‌లను అద్భుతంగా ప్రారంభించింది.



## ఫిబ్రవరి 14న 'లైలా' మెస్మరైజింగ్ ఐ లుక్


ఇది నిజంగా సర్ ప్రైజింగ్, డేరింగ్ స్టెప్. ఈ జనరేషన్ హీరోలెవరూ లేడీ క్యారెక్టర్ చేయడానికి సాహసం చేయరు. అయితే, డిఫరెంట్ జానర్‌ల చిత్రాలను చేస్తున్న మాస్ కా దాస్ విశ్వక్సేన్, షైన్ స్క్రీన్స్ సాహు గారపాటి నిర్మిస్తున్న తన లేటెస్ట్ మూవీ 'లైలా'లో మ్యాన్ అండ్ విమన్ గా కనిపించనున్నారు. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రానికి రామ్ నారాయణ్ దర్శకుడు. విశ్వక్సేన్‌ను లైలాగా మునుపెన్నడూ లేని క్యారెక్టర్ లో ప్రజెంట్ చేయడానికి పవర్ ఫుల్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. బ్రేవ్ అండ్ టఫ్ క్యారెక్టర్ ని అంగీకరించడం మెంటల్ గా ఫిజికల్ గా ఛాలెంజ్ తో కూడుకున్నది. మేకర్స్ లైలా ఐ లుక్‌ని రిలీజ్ చేశారు. విశ్వక్ సేన్ లైలాగా ఛార్మింగ్ లుక్ తో అదరగొట్టారు. విశ్వక్సేన్‌కి ఇది బ్యూటీఫుల్ మేక్ఓవర్. అతను పర్ఫెక్ట్ గా విమన్ లా కనిపించిన లుక్ అద్భుతంగా ఉంది. ఫిమేల్ గెటప్‌లో విశ్వక్‌లా మరే యాక్టర్ కనిపించి ఉండరనడంలో సందేహం లేదు. ఆ పాత్రకు ఆయన ఎంత అద్భుతంగా సూట్ అయ్యాడో ఆ కళ్లను చూస్తేనే అర్థమవుతుంది. లైలాగా విశ్వక్సేన్ కంప్లీట్ ఫేస్ ని చూసేందుకు ఎక్సయిమెంట్ మరింతగా పెంచింది. ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ఈరోజు గ్రాండ్ గా లాంచ్ అయ్యింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు కె. రాఘవేంద్రరావు క్లాప్ ఇవ్వగా, దర్శకుడు హరీష్ శంకర్ కెమెరా స్విచాన్ చేశారు.




## భయపెట్టబోతున్న అప్సరా రాణి.. 'రాచరికం'

అప్సరా రాణి, విజయ్ శంకర్, వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రల్లో గతంలో ఎన్నడూ చూడని కథతో 'రాచరికం' అనే మూవీ రాబోతోంది. ఈశ్వర్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాను చిల్ బ్రోస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి సురేష్ లంకలపల్లి కథ, కథనాన్ని అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమాకు సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నాయి. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా పర్ఫెక్ట్ అవుట్ పుట్ తీసుకొస్తున్నారు మేకర్స్. రీసెంట్‌గా రాచరికం మూవీ నుంచి హీరోయిన్ అప్సరా రాణి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేయగా ప్రేక్షకుల నుంచి భారీ రెస్పాన్స్ వచ్చింది. కాళీ మాత ఉగ్ర రూపం దాల్చితే, రక్తంతో ఒళ్లంతా తడిసి ముద్దైతే ఎలా ఉంటుందో.. ఈ పోస్టర్‌లో అప్సరా రాణి అలా కనిపించారు. ఈ పోస్టర్ చూస్తుంటే అప్సరా రాణికి అద్భుతమైన పాత్ర లభించినట్టుగా కనిపిస్తోంది. థ్రిల్లింగ్ కాన్సెప్ట్, డిఫరెంట్ కంటెంట్, సగటు ప్రేక్షకుడిని కట్టిపడేసే సన్నివేశాలతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు సారథి స్టూడియోస్‌లో శరవేగంగా జరుగుతున్నాయి.

చివరిదశ పనుల్లో ఉన్న ఈ సినిమాపై జనాల్లో అంచనాలు క్రియేట్ అయ్యాయి.



**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. "RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.